సాక్షి చిత్తూరు

శనివారం । 3 । ఆగస్టు । 2024



ట్రాన్స్‌కో ఏఈలకు షాక్

వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయని ట్రాన్స్‌కో ఏఈలకు ఉన్నతాధికారులు షాక్ ఇచ్చారు. ముగ్గురిని తాత్కాలికంగా రిలీవ్ చేశారు. - IIలో



రైతులకు కుచ్చుటోపీ

సేంద్రియం పేరుతో నకిలీ ఎరువులను రైతులకు అంటగడుతూ నిట్టనిలువునా ముంచేస్తున్నారు. - IIలో



ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం

ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. - IIలో

న్యూస్‌రీల్

గడ్డంవారిపల్లె వీఆర్వోకు రివర్షన్

చౌడేపల్లి: మండలంలోని గడ్డంవారిపల్లె వీఆర్వో వై.వెంకటమునికి వీఆర్‌ఏగా రివర్షన్ ఇస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పుంగనూరు మండల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములను ఆయన కుటుంబ సభ్యుల పేరిట పట్టా చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. విచారణలో అక్రమాలన్నీ నిర్ధారణ కావడంతో వీఆర్‌ఏగా రివర్షన్ ఇచ్చినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం: మండలంలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ అన్నపూర్ణ శారద తెలిపారు. ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ కళాశాలలో హిస్టరీ, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెకులు బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో కనీసం 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. ఈ నెల 8వ తేదీ లోపు దరఖాస్తు చేసుకుని 9వ తేదీ నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. దరఖాస్తులను ఈ మెయిల్ ఐడీ vedurukuppam. jkc@ gmail. com కు పంపవచ్చన్నారు. అవకాశం ఉన్న వారు కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 99128 68469, 98664 15051ను సంప్రదించాలని కోరారు.

మామిడికి ప్రత్యామ్నాయ పంటల అభివృద్ధి

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో మామిడికి ప్రత్యామ్నాయ పండ్ల తోటల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉద్యానవన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఉద్యానవన శాఖ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉద్యాన పంటల అభివృద్ధికిగానూ ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ.10.8 కోట్ల నిధులను కేటాయించినట్లు తెలియజేశారు. ప్రధానంగా మామిడికి ప్రత్యామ్నాయంగా పండ్ల తోటలు అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చే రైతులను వెంటనే గుర్తించాలన్నారు. వారికి 40 శాతం రాయితీపై పండ్ల మొక్కలను అందించనున్నట్లు చెప్పారు. కూరగాయల సాగుకు శాశ్వత పందిళ్ల ఏర్పాటు, పాలీహౌస్, ఫారం పాండ్, ప్యాక్ హౌస్‌ల ఏర్పాటుకు ముందుకు వచ్చే రైతుల జాబితాలు సిద్ధం చేయాలన్నారు. ఉద్యానవన పంటల సాగులో యాంత్రీకరణకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందన్నారు. పంటల సాగులో సంరక్షణ వ్యవసాయ విధానాన్ని చేపట్టే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆయా మండలాల పరిధిలోని ఉద్యాన అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ పరంగా అందించే సంక్షేమ ఫలాలను రైతులకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖ అధికారి కోటేశ్వర్, హెచ్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు రవాణాశాఖ మంత్రి రాక

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి శనివారం జిల్లాకు రానున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌కు ఉత్తర్వులు అందాయి. ఆయన 3వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకుని, మధ్యాహ్నం 12 గంటలకు చిత్తూరు బస్‌డిపో నుంచి నూతన బస్సులను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు చిత్తూరు నుంచి రోడ్డుమార్గాన రాయచోటికి బయల్దేరుతారు.

ప్రైవేట్ ల్యాబ్‌లపై దాడులు

తిరుపతి తుడా: జిల్లా వ్యాప్తంగా కోకొల్లలుగా పుట్టుకొచ్చిన ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌లపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శుక్రవారం దాడులు నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రైవేట్ ల్యాబ్‌లపై దాడులు నిర్వహించి వాటి సామర్థ్యాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌లను తనిఖీలు చేశారు. ల్యాబ్‌లకు అనుమతులు, లైసెన్సులపై ఆరా తీశారు. జిల్లా వ్యాప్తంగా సరైన రికార్డులు లేకపోవడంతో మొత్తం 19 ల్యాబ్‌లను సీజ్ చేశారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 61,465 మంది స్వామివారిని దర్శించుకోగా 21,206 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.66 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

▶▶ గంగాధర నెల్లూరు మండలం పీజీ అగ్రహారానికి చెందిన ఆర్ముగ రెడ్డి (60) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మండల కేంద్రంలోని ఓ మెడికల్ షాపు వద్దకు వచ్చారు. మెడికల్ షాపులోనే అనధికారికంగా నడుస్తున్న క్లినిక్‌కు వెళ్లారు. ఆ క్లినిక్ నిర్వాహకులు ఆయనకు వచ్చిన వ్యాధి ఏంటో కూడా గుర్తించలేదు. వెంటనే ఇంజక్షన్ ఇచ్చి సెలైన్ బాటిల్ పెట్టేశారు. ఈ క్రమంలో ఆ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీహెచ్‌సీ వైద్యులు ఆ క్లినిక్‌కు తాళం వేశారు.

▶▶ శ్రీరంగరాజపురం మండలం సీకేపురం గ్రామానికి చెందిన ప్రేమకుమార్, లోకేశ్వరి దంపతుల కుమార్తె ప్రీతి (5)కి గతేడాది జూలై 8న జ్వరం వచ్చింది. మండల సరిహద్దులోని ఆర్‌ఎంపీ డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. ఆయన క్షుణ్ణంగా పరీక్షించి ఇంజక్షన్ ఇచ్చాడు. కాసేపటికే బిడ్డ శరీరం రంగు మారింది. వెంటనే చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన ప్రభుత్వ వైద్యులు ఇంజక్షన్ డోస్ అధికంగా ఇవ్వడంతో గుండెలో రక్తం గడ్డకట్టిందని గుర్తించారు. వెంటనే తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బిడ్డ మృతి చెందింది.

▶▶ తిరుపతి జిల్లా డక్కిలి గురుకుల పాఠశాలలో చదువుతున్న షరీనా(10)కు జూలై 9న తీవ్ర జ్వరమొచ్చింది. బాలికను తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. అతడు ఇచ్చిన యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ కారణంగా బాలికకు రక్తపు వాంతులయ్యాయి. వెంటనే తల్లిదండ్రులు నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్ల సూచనల మేరకు తమిళనాడులోని చెన్నై ఎగ్మూర్ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ఆ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు డీఎంహెచ్‌ఓ వెల్లడించారు. ఇలాంటి సంఘటనలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెలుగుచూస్తున్నాయి.

డమ్మీ డాక్టర్!



చొక్కాపై తెల్లకోటు, మెడలో స్టెత్ వేసుకుని పేద రోగుల గొంతు కోసేస్తున్నారు. నగరాల్లోని పెద్దాస్పత్రికి వెళితే ఖర్చు భరించలేమన్న కారణంతో పేద జనం ఈ క్లినిక్స్‌ను ఆశ్రయిస్తుంటారు. ఇదే అదనుగా డమ్మీ డాక్టర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చేస్తున్నారు. చిన్న చిన్న పట్టణాల్లో వీధికో క్లినిక్ బోర్డు తగిలించేస్తున్నారు. అనుమతులు లేకుండా ల్యాబ్‌లు పెట్టేస్తున్నారు. ఇష్టానుసారంగా రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నారు. మరి కొందరైతే మెడికల్ దుకాణాల్లోనే ఏకంగా సర్జరీలు చేసేస్తున్నారు. కేవలం కాసుల కోసం గ్రామీణుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వీరిపై ఫిర్యాదులు వెల్లువలా వచ్చినప్పటికీ అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో జోగుతున్నారు.

- మెడికల్ షాపులే ఆపరేషన్ థియేటర్లు
- ఆర్‌ఎంపీలే స్పెషల్ సర్జన్లు
- పేద రోగుల ప్రాణాలతో చెలగాటం
- మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం

కాణిపాకం: విద్యార్హతలు లేకపోతేనేం.. ఎలాంటి జంకూ లేకుండా తెల్లకోటు తొడుక్కుంటున్నారు. అన్ని రకాల రోగాలకూ చికిత్స చేసేస్తున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 5 వేల మందికి పైగా ఆర్‌ఎంపీ, పీఎంపీలు కొనసాగుతున్నారు. రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లోనే అధికంగా నకిలీ డాక్టర్లు చలామణి అవుతున్నారు. గుడిపాల, యాదమరి, జీడీ నెల్లూరు, కార్వేటి నగరం, ఎస్‌ఆర్ పురం, వి.కోట, కుప్పం, నగరి, బంగారుపాళెం, పలమనేరు, సత్యవేడు, పుత్తూరు, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాల్లో కుప్పలు తెప్పలుగా క్లినిక్‌లు వెలుస్తున్నాయి. ఇందులో చాలా మంది రిజిస్ట్రేషన్ చేసుకోక పోగా మరికొంత మంది ఎలాంటి అనుమతులు లేకుండా వైద్యం చేస్తున్నారు. నకిలీ సర్టిఫికెట్లతో డాక్టర్లుగా చలామణి అవుతున్నారు. బీ-ఫార్మసీ సర్టిఫికెట్‌తోనే క్లినిక్‌లు తెరుస్తున్నారు. డాక్టర్ల వద్ద కొన్నాళ్లు కాంపౌండర్లుగా, సహాయకులుగా పనిచేసిన అనుభవంతో సొంత ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలుగా అవతారమెత్తుతున్నారు. వీరు రోగులను పరీక్షించి సూదిమందు ఇవ్వడంతోపాటు వివిధ రకాల మాత్రలు, మందులు ఇచ్చేస్తున్నారు. కొంత మంది ఏకంగా రక్త, మూత్ర పరీక్షల ల్యాబొరేటరీను సైతం నిర్వహిస్తున్నారు. అక్కడే సెలైన్‌లు అందిస్తున్నారు.

పల్లెలకు యథేచ్ఛగా మందుల సరఫరా

ఉమ్మడి జిల్లాలో 1800 మెడికల్ దుకాణాలుంటే, వివిధ ఔషధ కంపెనీలకు 725 ఏజెన్సీలు ఉన్నాయి. ఔషధ నియంత్రణ శాఖ నిబంధనల ప్రకారం వైద్యుల సిఫార్సులు లేకుండా మందులు విక్రయించడానికి అనుమతులు లేవు. కానీ కాసులకు కక్కుర్తి పడిన ఏజెన్సీల నిర్వాహకులు పల్లెల్లో ఆస్పత్రులు ఏర్పాటు చేసుకున్న ఆర్‌ఎంపీలకు, మెడికల్ షాపులకు ఇష్టారాజ్యంగా మందులను సరఫరా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇందులో అధికారికంగా రోజుకు మందులు, మాత్రల వ్యాపారం సుమారు రూ.60 నుంచి రూ.70 లక్షల వరకు జరుగుతోంది. అనధికారికంగా అయితే రూ.30 లక్షల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు ఏజెన్సీ, మెడికల్ దుకాణాల నిర్వాహకులు చెబుతున్నారు.

ధనార్జనే ధ్యేయంగా..

కొందరు ఆర్‌ఎంపీలు ధనార్జనే ధ్యేయంగా ఇష్టానుసారంగా వైద్యం చేస్తున్నారు. ప్రథమ చికిత్స అందించాల్సిన వీరు ఏకంగా ప్రత్యేక భవనాల్లో పడకలు ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందిస్తున్నారు. భారీ ఫ్లెక్సీలు, పెద్ద పెద్ద హోర్డింగులు ఏర్పాటు చేసుకుని ప్రచారం సాగిస్తున్నారు. కొన్ని చోట్ల క్లినిక్, మందుల దుకాణం, ల్యాబ్‌లు అన్నీ ఒకే గదిలో నిర్వహిస్తున్నారు. ఒక మెడికల్ షాపులో సర్జరీలు చేసినట్లు అధికారులు గుర్తించారు. పరిమితులు దాటి చేస్తున్న వైద్యం రోగుల ప్రాణం మీదకు వస్తోంది. తక్కువ డబ్బుతో వైద్యం అందుతుందన్న కారణంతో పేదలు క్యూ కడుతున్నారు. ఇదే అదనుగా నకిలీ వైద్యులు జేబులు నింపుకునే పనిలో పడ్డారు.

ఆర్‌ఎంపీలకు నిబంధనలు

నిబంధనల ప్రకారం ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. ఎలాంటి ఇంజక్షన్‌లు ఇవ్వకూడదు. ఎవరైనా జ్వరంతో బాధపడుతూ వస్తే సాధారణ మాత్రలే ఇవ్వాలి. తీవ్రత ఎక్కువగా ఉంటే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సిఫార్సు చేయాలి. కొందరు ఆర్‌ఎంపీలు తమ పరిధి దాటి చికిత్సలు చేస్తున్నారు. ప్రతి సమస్యకు ఇంజక్షన్ ఇచేస్తున్నారు. ఎక్కువ మోతాదులో యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్ వంటివి సూచిస్తున్నారు. వీటివల్ల రోగ నిరోధక శక్తిపై ప్రభావం చూపుతోంది. గర్భిణులు, చిన్న పిల్లలకు ఎలాంటి చికిత్స చేయకూడదు. ఫార్మసీ సర్టిఫికెట్లు దగ్గర ఉంచుకుని మందుల దుకాణాలు నిర్వహించడం కూడా నిబంధనలకు విరుద్ధమే. ఇలాంటి డమ్మీ డాక్టర్లపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు దాడులు చేసి అనుమతిలేని క్లినిక్‌లు, ఆస్పత్రులను 48 ఉన్నట్లు గుర్తించారు.



తిరుపతి జిల్లాలో ఆర్‌ఎంపీ క్లినిక్‌ల తనిఖీలో డీఎంహెచ్‌ఓ శ్రీహరి



జీడీనెల్లూరులోని క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి దేవి

హద్దు దాటకూడదు



ఆర్‌ఎంపీలు, పీఎంపీలు కచ్చితంగా వైద్య, ఆరోగ్య సూత్రాలు పాటించాలి. వారి ఇష్టానుసారంగా వైద్యం చేయరాదు. హద్దు దాటి ప్రవర్తించకూడదు. ప్రథమ చికిత్స వరకు మాత్రమే పరిమితం చేసుకోవాలి. ఇంజక్షన్‌లు, సెలైన్ పెట్టించడం, ఆపరేషన్ చేయడం, ప్రసవాలు చేయడం చేస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయి. ప్రజలు కూడా అవగాహన కలిగి ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలి. ఆర్‌ఎంపీ వైద్యంపై అప్రమత్తంగా ఉండాలి.

–శ్రీహరి, డీఎంహెచ్‌ఓ, తిరుపతి

ప్రభుత్వ వైద్యాన్ని వినియోగించుకోండి



గత కొన్నిరోజులుగా ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లపై దాడులు నిర్వహిస్తున్నాం. ఈ దాడుల్లో రిజిస్ట్రేషన్లు లేనివి, ఎలాంటి అర్హత లేకుండా వైద్య చికిత్స చేస్తున్న వాళ్లను గుర్తించాం. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. రోగులు ఎలాంటి సమస్యలున్నా ఇక్కడ చికిత్స చేసుకోవచ్చు. ఆర్‌ఎంపీలపై ఫిర్యాదులు వచ్చినప్పుడల్లా తనిఖీలు చేస్తున్నాం.

–ప్రభావతి దేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

ఉమ్మడి జిల్లా సమాచారం

రిజిస్ట్రేషన్ అయిన ఆస్పత్రుల సంఖ్య **300**	అనుమతులు లేని ఆస్పత్రులు **215**
అనుమతులున్న ల్యాబ్‌లు , స్కానింగ్ సెంటర్లు **419**	అనుమతులు లేని ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు **86**
రోజువారీ మాత్రలు, మందుల వ్యాపారం రూ.**60** లక్షల నుంచి రూ. **70** లక్షలు (సుమారు)	
అనధికారిక వ్యాపారం రూ.**25** లక్షలు	

ఇంజక్షన్‌లు ప్రాణాంతకం

కొందరు ఆర్‌ఎంపీలు, డమ్మీ డాక్టర్లు వేసే ఇంజక్షన్లు వికటించి రోగులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఏ వయసు వారికి ఏ మందు ఎంత డోస్ ఇవ్వాలో ఈ నకిలీ వైద్యులకు తెలియక పోవడమే ప్రధాన కారణం. మరోవైపు త్వరగా వ్యాధి తగ్గిపోవాలన్న కారణంతో అధికంగా డోసులు ఇచ్చేస్తున్నారు. ఫలితంగా ఇంజక్షన్ ఇచ్చిన అనంతరం తీవ్ర అస్వస్థతకు గురై గంటల వ్యవధిలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలా ఇంజక్షన్లు వికటించడం వల్ల వాంతులు చేసుకోవడం, చలిపెరగడం, శరీరమంతా దద్దుర్లు రావడం వంటి లక్షణాలు అధికంగా కనిపిస్తున్నాయి. పరిస్థితి అదుపులోకి రాకపోగా రోగులు కొందరు కోమాలోకి వెళ్తున్నారు. దీనిపై వైద్యాధికారులకు ఫిర్యాదులు వెల్లువలా వస్తున్నాయి.



మండలాలకు నూతన తహసీల్దార్లు

- డీటీలకు పూర్తి అదనపు బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మండలాలకు నూతన తహసీల్దార్లను నియమిస్తూ శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లు ఇతర జిల్లాలకు బదిలీ అయిన విషయం తెలిసిందే. అయితే ఎన్నికలు పూర్తి కావడంతో వారందరూ ఇటీవల చిత్తూరు జిల్లాకు బదిలీపై వచ్చారు. జిల్లాకు విచ్చేసిన తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. పోస్టింగ్‌లు పొందిన నూతన తహసీల్దార్‌లు వెంటనే ఆయా మండలాల్లో బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు. లేని పక్షంలో శాఖాపరంగా క్రమశిక్షణా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

డిప్యూటీ తహసీల్దార్లకు అదనపు బాధ్యతలు

గంగవరంలో పని చేస్తున్న ఎంఎస్.ఫణికుమార్‌ను పెద్దపంజాణి తహసీల్దార్‌గా, ఐరాలలో పనిచేస్తున్న సుధాకర్‌ను తవణంపల్లి, గుడిపాలలో పనిచేస్తున్న బి.కళ్యాణిని పెనుమూరు, చిత్తూరు అర్బన్‌లో పని చేస్తున్న కిరణ్‌ను విజయపురం, పెనుమూరులో పనిచేస్తున్న మహేష్‌కుమార్‌ను ఐరాల, సర్వే కార్యాలయంలో పనిచేస్తున్న జీఎల్.శివకుమార్‌ను గంగవరం, వెదురుకుప్పంలో పనిచేస్తున్న జయంత్‌ను యాదమరి తహసీల్దార్‌లుగా నియమించారు. ఏ.ఫణికుమార్‌ను అన్నమయ్య జిల్లాకు, అన్నమయ్య జిల్లా నుంచి విచ్చేసిన జయసింహను పులిచెర్లకు, తిరుపతి జిల్లా నుంచి విచ్చేసిన రమేష్‌బాబును వెదురుకుప్పంకు కేటాయించారు.

నియామకాలు ఇలా..

టి.సీతారామ్ (కలెక్టరేట్–ఏఓ)
కె.బ్యూలా (కలెక్టరేట్ – మెజిస్టీరియల్ సెక్షన్)
కె.పద్మజ (కో–ఆర్డినేషన్ సెక్షన్– కలెక్టరేట్)
పి.మురళి (ల్యాండ్ సెక్షన్– కలెక్టరేట్)
జీ.ఎం.కుమారస్వామి (ఎల్‌ఏ సెక్షన్ –కలెక్టరేట్)
ఆర్.వాసుదేవన్ (ల్యాండ్ రిఫారమ్స్ – కలెక్టరేట్)
ఎస్ఎస్.కృష్ణకుమార్ (డీఏఓ–ఆర్డీఓ కార్యాలయం, చిత్తూరు)
టీజీ.మోహనవల్లి (డీఏఓ–ఆర్డీఓ కార్యాలయం, పలమనేరు)
పి.శివరామన్ (డీఏఓ–ఆర్డీఓ కార్యాలయం, నగరి)
జి.జయప్రకాష్ (డీఏఓ – ఆర్డీఓ కార్యాలయం, కుప్పం)
కళావతి – చిత్తూరు అర్బన్ తహసీల్దార్
కె.బెన్నురాజ్ – సోమల
బి.హనుమంతు – చౌడేపల్లె
చంద్రశేఖర్‌రెడ్డి – గుడిపాల
బి.కులశేఖర్ – సదుం
డి.రవికుమార్ – నగరి
ఈ.శేషగిరిరావ్ – నింద్ర
ఎం.భగవతి – కార్వేటినగరం
వి.చంద్రశేఖర్ – జీడీనెల్లూరు
ఈ.అమర్‌నాథ్ – ఎస్.ఆర్.పురం
ఎం.అరుణకుమారి – పాలసముద్రం
ఎస్.ఎం.గురప్ప – పూతలపట్టు
కె.బాబురాజేంద్రప్రసాద్ – బంగారుపాళ్యం
ఆర్. ఇన్బనాథన్ – పలమనేరు
బి.పార్వతి – వి.కోట
ఎస్.మాధవరాజు – విజయపురం
వై.చిట్టిబాబు – కుప్పం
కె.అమర్‌నాథ్ – శాంతిపురం
కె.బాబు – రామకుప్పం
బి.రామాంజులునాయక్ – గుడుపల్లె
డి.లక్ష్మీనారాయణ –తిరుపతి జిల్లా

దృఢ సంకల్పంతో దూసుకెళ్లాలి

- ప్రభుత్వ డైట్‌లో చదవడం ఓ వరం
- ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్



మాట్లాడుతున్న తిరుపతి డీఈవో డాక్టర్ శేఖర్

కార్వేటినగరం: విద్యార్థులు దృఢ సంకల్పంతో ఆశయం వైపు దూసుకెళ్లాలని తిరుపతి డీఈవో, జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్) ప్రిన్సిపల్ డాక్టర్ వి.శేఖర్ పిలుపునిచ్చారు. డైట్‌లో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషెర్స్ డే సమావేశానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కార్వేటినగరం డైట్‌కు ఓ ప్రత్యేకత ఉందని, ఇక్కడ చదివిన ఛాత్రోపాధ్యాయులు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని గుర్తు చేశారు. ఇక్కడ విద్యనభ్యసించడం ఒక వరంలా భావించాలని చెప్పారు. రానున్న డీఎస్సీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధ్యాపకులు అందించే సలహాలు, సూచనలు తప్పక పాటించి లక్ష్యాన్ని సాధించే వరకు విశ్రమించకూడదని పేర్కొన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఛాత్రోపాధ్యాయులకు జ్ఞాపికలను అందించారు. ఛాత్రోపాధ్యాయులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సుబ్రమణ్యం, అధ్యాపకులు నిర్మల, దేవప్రసాద్, రఫీ, రెడ్డివెంకటరమణ, సునీత, అనిత, నాగరాజనాయక్, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పని దినాలు పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనుల్లో పనిదినాలు పెంచాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం వంటి పనులను ప్రారంభించాలన్నారు. కూలీల మొబిలైజేషన్, 100 రోజుల పని దినాల కల్పనపై ఏపీడీలు, ఏపీఓలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెప్పారు. జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకంలో ఇంటి నిర్మాణ పనులకు ఉపాధి కూలీలను వినియోగించుకునేందుకు అవకాశం ఉందన్నారు. కూలీలకు వంద రోజుల పని దినాలను పూర్తి చేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 40 లక్షలు పని దినాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 32,26,869 పని దినాలను కల్పిస్తూ 80.67% లక్ష్యాన్ని సాధించినట్లు డ్వామా పీడీ రాజశేఖర్ కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో అతిథి ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించేందుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కో ఆర్డినేటర్ పద్మజ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునే వారికి బీఈడీతో పాటు టెట్ అర్హత పొంది ఉండాలన్నారు. పీజీలో సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు, బీఈడీలో సంబంధిత సబ్జెక్టులో మెథడాలజీ చదివి ఉండాలని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 5వ తేదీలోపు స్వయంగా జిల్లా కేంద్రంలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న జిల్లా డీసీఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

క్లుప్తంగా

జిల్లా స్థాయి చెస్ పోటీలు రేపు

నగరి : చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంయుక్తంగా లయన్స్ క్లబ్ నిర్వహించే చెస్ పోటీలు ఈ నెల 4వ తేదీన ప్రారంభమవుతాయని ఆ సంస్థ జిల్లా డైరెక్టర్ ప్రభాకర్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 16 జూనియర్ కేటగిరిగా, 16 ప్లస్ సీనియర్ కేటగిరిగా కేటాయించి పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహిళలకు, దివ్యాంగులకు, విశ్రాంత క్రీడాకారులకు, అండర్ – 7, అండర్ 9 క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. మండలంలోని వీకేఆర్ పురం గ్రామం తిరుత్తణి–రేణిగుంట జాతీయ రహదారిలో ఉన్న అశ్విని కన్వెన్షన్ సెంటర్‌లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటల్లోపు క్రీడాకారులు హాజరుకావాలన్నారు. క్రీడాకారులకు నిర్వాహకులే భోజన వసతి కల్పిస్తారన్నారు. వివరాలకు 9866112017ను సంప్రదించాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వెదురుకుప్పం విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

వెదురుకుప్పం: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు వెదురుకుప్పం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికై న విద్యార్థులను శుక్రవారం హెచ్‌ఎం, ఉపాధ్యాయుల బృందం అభినందించింది. హెచ్‌ఎం మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఐరాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన సీనియర్ సాఫ్ట్‌బాల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో విద్యార్థులు తరుణ్, ఉమ, హిందూ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. వీరు ఈ నెల 10, 11, 12 తేదీల్లో పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో చిత్తూరు జిల్లా తరపున ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. ఈ క్రమంలో భాగంగా పీడీ రమేష్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

విజయపురం : ఒంటరితనం భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు, కలియంబాకం ఆదిఆంధ్రవాడకు చెందిన నాగభూషణం (49) అదే గ్రామానికి చెందిన దేశమ్మను 20 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. ఆ తరువాత ఐదేళ్లకే భార్య ఆయన్ను విడిచిపెట్టి దూరంగా ఉంది. సుమారు 15 ఏళ్లుగా ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి తన ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. మృతుని తమ్ముడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయప్ప తెలిపారు.

రైతులకు కుచ్చుటోపీ

పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో సేంద్రియ ఎరువుల పేరిట కొందరు రైతులకు కుచ్చుటోపీ పెడుతున్నారు. వీటిని వినియోగిస్తే దిగుబడులు అంతంతమాత్రమే రావడంతో తాము మోసపోయామని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కొనుగోళ్లకు సంబంధించి ఎలాంటి రసీదులు, వ్యాపారుల వివరాలు ఉండకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. మరి కొందరు కొత్త రకం విత్తనాలు, డ్రిప్ ఎరువులు, బయో పెస్టిసైడ్స్ పేరిట దగా చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కూరగాయల పంటలు ఎక్కువగా పండిస్తున్నారు. దీనిని అవకాశంగా తీసుకుని కొంతకాలంగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన అక్రమ వ్యాపారులు వాహనాల్లో వచ్చి వీటిని విక్రయించి జేబులు నింపుకుంటున్నారు.



బయో పెస్టిసైడ్స్ వినియోగించడంతో దెబ్బతిన్న బీన్స్ పంట

- సేంద్రియ ఎరువుల పేరిట విక్రయాలు
- బయో పెస్టిసైడ్స్ పేరిట మరికొందరు
- కర్ణాటక నుంచి తెచ్చి అమ్మకాలు
- ధర తక్కువని కొనుగోలు చేసి నష్టపోతున్న రైతులు

పలమనేరు: పలమనేరు వ్యవసాయశాఖ పరిధిలో కర్ణాటక రాష్ట్రాన్ని ఆనుకుని పలు మండలాలు ఉన్నాయి. ఇక్కడ కూరగాయల సాగు ఎక్కువగా ఉంది. ముఖ్యంగా టమాట, బీన్స్, క్యాబేజీ, ముల్లంగి, బీట్‌రూట్, బంగాళదుంప, క్యారెట్, బెండ, వంకాయ, కాకర, బీర, కొత్తిమీర, కరివేపాకు, మునగ తదితర స్వల్పకాలిక పంటలను ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఈ పంటల సాగుకు భూమిని బాగా సారవంతం చేయాల్సి ఉంది. అలాగే పంటలకు ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడాల్సిందే. పొరుగునే ఉన్న కర్ణాటకలో పండుతున్న ఈ పంటలను చూసి ఆకర్షితులైన రైతన్నలు కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలోనూ సాగు చేస్తున్నారు.

నకిలీల మాయాజాలం

కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్, కోలార్, చింతామణి ప్రాంతాలకు చెందిన కొందరు టమాట, బీన్స్, చిక్కుడు విత్తనాలను ఏమాత్రం అనుమానం రాకుండా ఒరిజినల్ ప్యాకింగ్‌తో ఓ వాహనంలో వచ్చి వారే నేరుగా పల్లెటూళ్లలో రైతులకు అంటగడుతున్నారు. వీటిని సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని ఊదరగొట్టడానికి తోడు తక్కువ ధరకే ఇస్తున్నారు. దీంతో రైతులు ఇట్టే ఆకర్షితులై కొనుగోలు చేస్తున్నారు. పావని, బీ బయో, కే బయో తదితర పేర్లతో సేంద్రియ ఎరువులు, బయో గ్రోత్ టానిక్కులు విక్రయిస్తున్నారు. సేంద్రియ ఎరువుల పేరిట చక్కర కర్మాగారాల్లోని వృథా (వేస్ట్ మడ్, షుగర్ మడ్)ను నింపి ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో రైతులకు అమ్ముతున్నారు. బెంగళూరుకు చెందిన పలువురు సేంద్రియ ఎరువుల పేరిట యూనిక్, జుబ్రిక్ యాసిడ్లను కలిపి నకిలీ సేంద్రియ ఎరువులను అమ్ముతున్నారు. వీటిని వాడితే మొక్క ఏపుగా పెరుగుతుంది గానీ పంట దిగుబడి మాత్రం రాదు. గతంలో వి.కోట మండల కేంద్రంలో ఇలాంటి నకిలీ సేంద్రియ ఎరువులను వ్యవసాయాధికారులు స్వాధీనం చేసుకున్నారు.

బయో పెస్టిసైడ్స్ పేరిట గ్రామాల్లో డెమోలు

రైతులు సేంద్రియ పద్ధతులను అవలంబించాలని అధికారులు సూచిస్తున్న నేపథ్యంలో దీన్ని ఆసరాగా చేసుకుని కర్ణాటక నుంచి బయో పెస్టిసైడ్స్ (జీవన పురుగు మందులు) పేరిట నకిలీ మందులను తెచ్చి రైతులకు అంటగడుతున్నారు. వాహనాల్లో వచ్చి డెమో సైతం ఇస్తుండటం గమనార్హం! కర్ణాటక నుంచి ప్రత్యేక వాహనాల్లో ఇక్కడి పల్లెల్లోకొచ్చి డెమోలు నిర్వహిస్తూ అంటగడుతున్నారు. ఆ గ్రామాల్లో వీటిని విక్రయించాక ఆ తర్వాత అటువైపు వెళ్లరు. ఫలితంగా రైతులు పంట చేతికి రాక నష్టపోతున్నారు. అంతేతప్ప మరేమీ చేయలేకపోతున్నారు.

వ్యవసాయశాఖ దాడులు చేసినా ప్రయోజనం శూన్యం

ఇటీవల గుంటూరు నుంచి వచ్చిన వ్యవసాయశాఖ అధికారులు స్థానిక అధికారులతో కలసి డివిజన్‌లోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై దాడులు చేశారు. దుకాణదారుల నుంచి శాంపిల్స్ సేకరించారు. అయితే వీటి ఫలితాలొచ్చే లోపే సంబంధిత యజమానులు అన్నీ సక్రమంగా ఉన్నట్టు మేనేజ్ చేయడం పరిపాటిగా మారింది. ఇక అనధికారికంగా విక్రయించేవారిని కట్టడి చేయడం వ్యవసాయశాఖకు తలకు మించిన భారమే అవుతోంది.

దుకాణాల్లోనే ఎరువులు కొనాలి

నకిలీ విత్తనాలు, సేంద్రియ ఎరువులు, బయో పెస్టిసైడ్స్ పేరిట ఎవరైనా గ్రామాల్లోకి వస్తే కొనొద్దు. కర్ణాటక నుంచి ఇలాంటి వారెవరైనా మీ వద్దకు వస్తే మాకు సమాచారం ఇవ్వండి. తక్కువ రేటుకు ఇస్తున్నారు కదా? అని కొనుగోలు చేసి ఇబ్బందులు పడకండి. లైసెన్సు కలిగిన ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాల్లో కొనడం మంచిది. దీంతో పాటు విధిగా బిల్లు పొందాలి. ఇప్పుడు మోసపోయిన రైతులు వినియోగదారుల ఫోరానికి వెళ్లాలన్నా వీలు లేని పరిస్థితి. కర్ణాటక నుంచి ఎవరైనా వస్తే మాకు సమాచారం ఇవ్వండి.

–సంధ్య, వ్యవసాయాధికారిణి, పలమనేరు

మందు పిచికారీ చేస్తూ వ్యక్తి మృతి

పూతలపట్టు : పురుగుల మందు పిచికారీ చేస్తూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చేసుకుంది. సీఐ సుదర్శన్ ప్రసాద్ కథనం మేరకు, ఎగువ పాలకూరుకు చెందిన ఎం.రామమూర్తి రైతుకు చెందిన మామిడి చెట్లకు పురుగుల మందు పిచికారీ చేస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించారు. అనంతరం సీఐ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత వెల్లడిస్తామని చెప్పారు.

బోయకొండలో ఆషాఢ పూజలు



ప్రత్యేక పూజలందుకొన్న అమ్మవారు

చౌడేపల్లె: మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ఆషాఢమాసపు ఆఖరి పూజలు నిర్వహించారు. రాహుకాల సమయంలో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి, అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఉభయదారులుగా వ్యవహరించారు. అన్న ప్రసాదానికి చిట్రెడ్డిపల్లెకు చెందిన శంకరయ్య, జయలక్ష్మి దంపతులు విరాళం అందించారు.

మండుటెండలో మోకాళ్ల దండన



పాఠశాల ప్రాంగణంలో మోకాళ్లపై కూర్చున్న విద్యార్థులు

రేణిగుంట: రేణిగుంట–తిరుపతి మార్గం ఫ్లైఓవర్ వంతెన సమీపంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులు హోం వర్క్ రాయలేదన్న కారణంగా పాఠశాల ప్రాంగణంలో ఆరుబయట మోకాళ్లపై కూర్చోబెట్టిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పాఠశాలలోని వివిధ క్లాసులకు చెందిన 40 మంది విద్యార్థులు హోం వర్క్ రాయలేదన్న నెపంతో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు, పీఈటీ కలసి విద్యార్థులను క్లాస్ రూము నుంచి బయటకు తీసుకొచ్చి ఆరుబయట ఎండలో మోకాళ్లపై కూర్చోబెట్టారు. అక్కడే వారితో హోం వర్క్ రాయించి క్రమశిక్షణ పేరుతో పైశాచికం ప్రదర్శించారు. మీడియావారు స్కూల్ వద్దకు వెళ్లి వీడియోలు తీయడంతో వారిని స్కూల్ సిబ్బంది అడ్డుకున్నారు. వాగ్వాదం చోటుచేసుకోవడంతో గాజులమండ్యం పోలీసులు చేరుకుని మీడియా వారికి సర్దిచెప్పి పంపారు. విషయం తెలుసుకున్న డీఈవో శేఖర్ వెంటనే రేణిగుంటలోని స్కూల్ వద్దకు చేరుకుని, విచారించారు. పిల్లలను వేర్వేరుగా పిలిచి మాట్లాడారు. విద్యార్థులను హింసించిన ఇద్దరు ఉపాధ్యాయులను పాఠశాల నుంచి తొలగించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే మరింత కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎంఈవో–2 రంగనాథ్ పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పలు శాఖల అధికారులతో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రేషన్ కార్డుదారులకు మరింత నాణ్యమైన నిత్యావసర వస్తువులతోపాటు పకడ్బందీగా ఈ వ్యవస్థను నిర్వహించాలన్నారు. ప్రస్తుతం 15 రోజుల వరకు ఎండీయూ ఆపరేటర్లు వారి పరిధిలో రేషన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్డుదారుల బయోమెట్రిక్ పని చేయని పక్షంలో ఐరీష్, వీఆర్‌ఓ ఆమోదంతో రేషన్ ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతి నెలా మొదటి శుక్రవారం బాలింతలకు, గర్భవతులకు రేషన్ సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌ఓ శంకరన్, డీఎం మోహన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్ లక్ష్యాలను అధిగమించండి

జిల్లాలో ఖరీఫ్‌కు నిర్దేశించిన వంద శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు. వ్యవసాయ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత ఏడాది ఖరీఫ్ లక్ష్యం కంటే ఈ సంవత్సరంలో ఎక్కువ సాగు చేయడానికి క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఖరీఫ్ సీజన్లో వేరుశనగ, వరి, రాగులు, కందులు, ఉలవలు పంటలు వేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

రుణాలు అందించాలి

రైతులకు వ్యవసాయానికి రుణాలు ఇవ్వడానికి నిర్లక్ష్యం చేస్తున్న బ్యాంకు అధికారులతో మాట్లాడి రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయించాలన్నారు. పలమనేరు, బంగారుపాళెం మండలాల్లో వేరుశనగ పంటలకు అడవి పందులు, ఏనుగుల వల్ల నష్టం జరుగుతుందని అందువల్ల రైతులు ముందుకు రావడం లేదని ఏడీలు తెలిపారు. అయితే సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.48 లక్షల మద్యం ధ్వంసం



జేసీబీతో మద్యం ధ్వంసం చేస్తున్న పోలీసులు

బంగారుపాళెం: మండలంలో పట్టుబడిన అక్రమ మద్యాన్ని శుక్రవారం ధ్వంసం చేసినట్లు సీఐ లక్ష్మయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో 24 కేసుల్లో పట్టుబడిన 6,901 లీటర్ల మద్యం, 19 లీటర్ల నాటు సారా సీజ్ చేసినట్లు తెలిపారు. వీటి విలువ రూ.48 లక్షలు ఉంటుందన్నారు. సీజ్ చేసిన మద్యం బాటిళ్లను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు స్థానిక మామిడి మార్కెట్ యార్డు ఆవరణలో సెబ్ ఏఈఎస్ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీ వాహనంతో ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. అక్రమ మద్యం రవాణాకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ పునీత్, పోలీస్, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్వేటినగరంలో దేవాంగపిల్లి



కార్వేటినగరంలో కనిపించిన దేవాంగపిల్లి

కార్వేటినగరం: శేషాచలం అడవుల్లో అరుదుగా కనిపించే దేవాంగపిల్లి కార్వేటినగరం–పచ్చికాపల్లం మార్గంలోని చిన్న కనుమ వద్ద శుక్రవారం ప్రత్యక్షమైంది. దీన్ని గుర్తించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ లోకేష్ వెంటనే అటవీశాఖ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు. అయితే వారు అందుబాటులోకి రాక పోవడంతో లోకేష్ తన స్నేహితులతో కలసి దేవాంగపిల్లిని అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్లి అప్పగించారు. దీంతో స్పందించిన అటవీశాఖ అధికారులు దట్టమైన అటవీ ప్రాంతంలో వదిలిపెడతామని హామీ ఇచ్చారు.

ట్రాన్స్‌కో ఏఈలకు షాక్

- ముగ్గురు ఏఈలు రిలీవ్
- తదుపరి మరో 10 మంది
- వర్క్‌ఆర్డర్లు క్లోజ్ చేయకపోతే పరిస్థితి దారుణం



చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌కో పరిధిలో వర్క్‌ఆర్డర్లు క్లోజ్ చేయని ఏఈల జీతాల నుంచి ఆ మొత్తం రికవరీ చేస్తామని పలుమార్లు అధికారులు హెచ్చరించారు. ఇప్పుడు కార్యాచరణలోకి దిగారు. ఐదురోజుల వ్యవధిలో ముగ్గురు ఏఈలను తాత్కాలికంగా రిలీవ్ (సెలవులో వెళ్లాలంటూ ఉత్తర్వులు జారీ)చేశారు. వర్క్‌ఆర్డర్లు క్లోజ్ చేయకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని పెనుమూరు, అవిలాల, పైపల్లె ఏఈలు నీరజ, నాగరాజు, కిరణ్ కుమార్‌ను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. వారు వర్క్‌ఆర్డర్లను క్లోజ్ చేశాక తదుపరి పోస్టింగ్స్ ఇవ్వనున్నారు. అంతవరకు వారికి జీతా లు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. జిల్లాలో 2019– 20 నుంచి ఇప్పటి వరకు దాదాపు 100 మంది ఏఈ ల పరంగా 15,060 పైగా వర్క్‌ఆర్డర్లు క్లోజ్ చేయా ల్సి ఉండగా వాటి విలువ దాదాపు రూ.100 కోట్ల వరకు ఉంది. తదుపరి మరో 10 మంది ఏఈలను రిలీవ్ చేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

వర్క్‌ఆర్డర్లు అంటే..

ట్రాన్స్‌కోలో ఎలాంటి పనులు చేయాలన్నా దీనికి అవసరమైన విద్యుత్ పరికరాల వివరాలను తెలుపుతూ ఏఈలు సిద్ధం చేసే నివేదికను వర్క్‌ఆర్డర్ అంటారు. వీటిని డీఈ, ఈఈలు ఆమోదిస్తారు. తదుపరి జిల్లా స్టోర్స్ నుంచి పరికరాలను తీసుకుని క్షేత్రస్థాయిలో విద్యుత్ స్తంభాలు నాటడం, సర్వీసు విడుదల, లైన్‌లాగడం, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు..ఇత్యాది పనులు వర్క్‌ఆర్డర్ల ద్వారా చేస్తున్నారు. పని అయ్యాక అందుకు వాడిన మెటీరియల్స్, మిగిలినవి లెక్క చూపుతూ వాటిని క్లోజ్ చేయాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో మెటీరియల్స్ డ్రా చేశాక వినియోగదారుడి పరంగా భూసమస్య, కోర్టు కేసులు తదితర అంశాల వల్ల ఆ మెటీరియల్‌ను మరో పనికి వాడుతున్నారు. జిల్లాలో మొత్తం దాదాపు 100 మంది వరకు ఏఈల పరంగా దాదాపు రూ.100 కోట్ల వరకు విలువైన 15,060 వర్క్‌ఆర్డర్లను క్లోజ్ చేయాల్సి ఉంది.

తదుపరి 10 మంది

ప్రధానంగా 2019–20వ సంవత్సరానికి సంబంధించి 30 మంది ఏఈలు వర్క్‌ఆర్డర్లు మొత్తం ఎక్కువగా పెండింగ్‌లో పెట్టుకుని ఉన్నారు. వీరిలో అధికంగా పెండింగ్‌లో ఉన్న 10 మంది ఏఈలను తొలుత తాత్కాలికంగా రిలీవ్ చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. దీంతో కదలిక వచ్చి మిగిలిన వారు పనులను పూర్తి చేస్తారని భావిస్తున్నారు. అధికారులు బదిలీ అయినా ఉద్యోగోన్నతి పొందినా సరే పెండింగ్ వాటిని క్లోజ్ చేయాల్సి ఉంది. ఇప్పటికే 100 మంది ఏఈల్లో 10 మంది వరకు ఉద్యోగోన్నతి, బదిలీల్లో ఇతర జిల్లాలకు వెళ్లారు. ఏఈలు వర్క్‌ఆర్డర్లు క్లోజ్ చేసినా డీఈ, ఈఈలు వాటిని ఆమోదించని పక్షంలో తదుపరి వారిపై చర్యలు తీసుకోనున్నట్టు తెలుస్తోంది.